సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



కూరగాయల సాగు..

గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి రైతులు తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. స్థానిక మార్కెట్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. IIIలో▸

జిల్లాలో పోలీసు యాక్ట్ 30

ఆసిఫాబాద్అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి 29వ తేదీ వరకు పోలీసు యాక్ట్ 30(1961) అమలులో ఉంటుందని ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.7 /17.8

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. వేకువజామున చల్లగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు నిర్మల్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం

ఆసిఫాబాద్అర్బన్: ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం- 2024పై కుమురంభీం, నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, ప్రభుత్వ సంస్థలు,శాఖల ప్రత్యేక కార్యదర్శి భారతి లక్‌పతినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ఉంటుందన్నారు. నాలుగు జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, రిటర్నింగ్, బూత్‌స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రయోగ పరీక్షలు షురూ



ఆసిఫాబాద్ ప్రభుత్వ కళాశాలలో పరీక్షను పర్యవేక్షిస్తున్న డీఐఈవో శంకర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లావ్యాప్తంగా గురువారం ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో సెకండియర్ విద్యార్థులకు నిర్వహించిన ప్రాక్టికల్స్‌ను డీఐఈవో శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించి పరీక్షకు మొత్తం 906 మందికి 793 మంది హాజరయ్యారని తెలిపారు. 113 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. జనరల్ విభాగంలో 305 మందికి 291 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 601 విద్యార్థులకు 502 హాజరు కాగా 99 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు మొత్తం 707 మంది విద్యార్థులకు 671 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 255 మందికి 244 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో తెలిపారు. పరీక్షలకు సంబంధించిన వివరాలను రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ఆసిఫాబాద్అర్బన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. ఆపరేషన్ స్మైల్- 10 కార్యక్రమం ముగింపు సందర్భంగా గురువారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్- 10 కార్యక్రమం కొనసాగిందన్నారు. నెల రోజుల వ్యవధిలో 68 మంది బాలకార్మికులను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 63 మంది బాలురు ఉండగా, ఐదుగురు బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో మొత్తం 28 మంది, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 40 మంది ఉన్నారని తెలిపారు. యజమానులు, తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలను తాత్కాలిక ప్రయోజనాల కోసం పనిలో పెట్టుకుని వారి భవిష్యత్తు నాశనం చేయొద్దని కోరారు. జిల్లాలో ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకున్నా.. శారీరకంగా, మానసికంగా, లైంగిక, ఆర్థిక దోపిడీకి గురవుతున్న బాలలు కనిపిస్తే పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. 1098, డయల్ 100 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించే ఆపరేషన్ స్మైల్ బృందంలో పని చేసిన పోలీసులు, అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

'గ్రామాల్లో బీజేపీని విస్తరించాలి'

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని విస్తరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షతన చలో అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ మండలంలో చలో అభియాన్ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన పార్టీ కార్యక్రమాలు చేపట్టి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం మరోసారి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తపల్లి శ్రీనివాస్‌ను నాయకులు, కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గావ్ చలో అభియాన్ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, డివిజన్ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు పసునూరి తిరుపతి, సప్త శ్రీనివా స్, ఈదులవాడ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశే..!

- కేంద్ర బడ్జెట్‌లో కొత్త రైళ్లు, సింగరేణి ప్రస్తావన లేకపోవడంపై అసంతృప్తి
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాలు
- స్వశక్తి మహిళలకు ఊరట
- అంగన్‌వాడీలకు 'ఆయుష్మాన్', బాలికలకు వ్యాక్సినేషన్
- సోలార్ రూఫ్ స్కీంలో 300 యూనిట్ల ఉచిత విద్యుత్



ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు ఆశించిన ఊరట దక్కలేదు. కొత్త రైళ్లు, సింగరేణి ప్రస్తావన లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో 2024- 25 ఆర్థిక సంవత్సరానికి మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆశించిన విధంగా కేటాయింపులు లేకపోవడంతో రాజకీయ, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రైళ్లు లేవ్.

జిల్లా ప్రజలకు కీలకమైన కాజీపేట్ రైల్వే డివిజన్ ఏర్పాటు డిమాండ్ ఏళ్లుగా ఉంది. అయితే తాజా బడ్జెట్‌లో దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌రోడ్ మీదుగా వెళ్లే మార్గంలో కొత్త రైళ్ల ప్రతిపాదనలు కూడా ఏవీ లేవు. రైలు బోగీలన్నీ వందే భారత్‌తో మార్పు చేయడం మాత్రం ప్రయాణికులకు ఊరట కలిగించే అంశం. ప్రస్తుతం ఉన్న ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సీట్లు సౌకర్యవంతంగా లేవు. వందేభారత్ రైళ్ల తరహాలో బోగీలను ఆధునీకరిస్తే కాగజ్‌నగర్, సిర్పూర్(టి), రేచినీ, రవీంద్రఖని, మందమర్రి, బెల్లంపల్లి, మంచిర్యాల రైల్వేస్టేషన్ల గుండా ప్రయాణించే వారికి సౌకర్యంగా ఉంటాయి.

స్వశక్తి మహిళలకు లబ్ధి..

బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1.77 లక్షల కోట్లు, గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ.86 వేల కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా జిల్లాలోని సుమారు 8 వేల స్వశక్తి మహిళా సంఘాల్లోని 88 వేల మంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది. ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన 1,55,933 మందికి లబ్ధి చేకూరుతుంది. ఆహార ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.2.13 లక్షల కోట్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రేషన్ కార్డుదారులకు మరో ఐదేళ్లు ఉచిత రేషన్ అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో జిల్లాలోని 1,26,922 మంది రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్ అందనుంది.

ఆదాయ పన్ను యథాతథం

ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు చేయలేదు. ఇతరత్రా కొత్త పథకాలేవీ ప్రవేశపట్టకపోవడంతో నెలవారీ వేతన జీవులు నిరాశ చెందుతున్నారు. గతేడాది రూ.7లక్షల వరకు ఉన్న ఆదాయపన్ను యథావిధిగా కొనసాగించారు. ఇక పీఎం ఆవాస్ కింద సొంతింటి కల నిజం చేసేందుకు ప్రత్యేక పథకం తీసుకొచ్చారు. వచ్చే ఐదేళ్లలో దేశంలో 2కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో నిరుపేదలకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలో సొంతిళ్లు లేని 15,418 మంది ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సింగరేణి కార్మికులకు నెలవారీ జీతంలో ఆదాయ పన్నులకే పోతోంది. వీరికి పన్ను మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్‌ను పట్టించుకోలేదు. 2022- 23 బడ్జెట్‌లో సింగరేణికి రూ.1650కోట్లు ప్రకటించారు. ఈ సారి ఎలాంటి నిధులు కేటాయించలేదు.

సోలార్ వెలుగులు

దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రూఫ్ టాప్ సోలార్‌రైజేషన్ కింద ఈ పథకం తీసుకురానున్నారు. జిల్లాలో 80శాతం గృహ విద్యుత్ వినియోగం 300యూనిట్లలోపే ఉంటోంది. సుమారు 1.30 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ పథకంలో జిల్లా వాసులకు అవకాశం దక్కనుంది. ఇక వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి కింద 2.3లక్షల మందికి కొత్త రుణాలు ఇవ్వనున్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లోని వీధివ్యాపారులకు ప్రయోజనం కలగనుంది.

'ఆయుష్మాన్'తో ఆరోగ్య భద్రత

ఆయుష్మాన్ భారత్ కింద బడ్జెట్‌లో రూ.7,500కోట్లు కేటాయించారు. రాష్ట్ర పరిధిలో జరిగే పథకంలో జిల్లా వాసులకు వైద్యారోగ్య సేవలు అందనున్నాయి. కొత్తగా ఈసారి అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు ప్రయోజనం కలగనుంది. జిల్లాలోని 834 అంగన్‌వాడీ కేంద్రాలు, 139 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా వీరు ఆందోళనలు చేస్తుండగా తాజా ప్రకటనతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య భద్రత పొందవచ్చు.

బాలికలకు వ్యాక్సినేషన్..

9నుంచి 14 ఏళ్ల బాలికలు గర్భాశయ ముఖ ద్వార కాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నారు. గిరిజన బాలికలు ఎక్కువగా ఉండే జిల్లాకు ఇది అత్యంత అవశ్యకం. మిషన్ ఇంద్రధనుష్‌ను 'యూ విన్'గా తీసుకురానున్నారు. జిల్లాలో 6 వేల మందికిపైగా చిన్నారులు ఈ పథకంలో వ్యాక్సిన్లు పొందే అవకాశం ఉంది. వ్యవసాయ, రైతుల సంక్షేమానికి దేశ వ్యాప్తంగా రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారు. రసాయనాలు, ఎరువుల కోసం రూ.1.68 లక్షల కోట్లు కేటాయించడంతో జిల్లాలోని 1.12 లక్షల మందికి రైతులకు లబ్ధి చేకూరనుంది. మాతాశిశు సమగ్ర అభివృద్ధితో అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరణ చేయనున్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.6,200 కోట్లు కేటాయించడంతో వెనుకబడి జిల్లాలోని పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరనుంది. దశాబ్ద కాలంలో టీ- ఐడియా, టీ- ప్రైడ్ పథకాల ద్వారా జిల్లాలో 350 మంది దరఖాస్తు చేసుకోగా.. 315 మంది లబ్ధిదారులకు రూ.225 కోట్ల రాయితీ మంజూరు చేశారు.

ఆదాయాన్ని పెంచే బడ్జెట్



కౌటాల: మధ్యంతర బడ్జెట్ ప్రభుత్వ, ప్రజల ఆదాయాన్ని పెంచే విధంగా ఉంది. బీజేపీ ప్రభుత్వ బడ్జెట్ అన్నివర్గాల ప్రజల ఆంక్షాలు నెరవేరుస్తుంది. దేశంలోని దాదాపు 70శాతం ప్రభుత్వ ఇళ్లు మహిళలకు మంజూరు చేయడం, ఉన్నత విద్యలో మహిళలను ప్రోత్సాహించడం శుభపరిణామం. 12 కోట్ల మంది రైతులకు సాయం అందించడంతో కేంద్రం రైతు పక్షపాతి అని స్పష్టమవుతుంది. వచ్చే ఐదేళ్ల దేశాభివృద్ధికి ప్రణాళికలా ఉపయోగపడుతుందని భావిస్తున్నా. మరోసారి బీజేపీని ఎన్నుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే

రక్షణ రంగానికి కేటాయింపులు



కాగజ్‌నగర్‌రూరల్: 2024 మధ్యంతర బడ్జెట్ దీర్ఘకాలిక దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టారని తెలుస్తోంది. రక్షణ రంగానికి కేటాయింపులు పెంచడం ద్వారా దేశ రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఆదాయపు పన్ను విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వేతన జీవులు కొంత నిరాశ చెందుతున్నారు.

– డి.లక్ష్మీనరసింహం, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్

విద్యారంగానికి నిధులేవి?



ఆసిఫాబాద్‌రూరల్: కేంద్ర బడ్జెట్ విద్యారంగం మెరుగుపర్చేందుకు ఎలాంటి కేటాయింపులు లేవు. కొత్త యూనివర్సిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోలేదు.

కార్తీక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

సామాన్యుడికి ఊరట



ఆసిఫాబాద్అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా సామాన్యులకు ఊరటనిచ్చే బడ్జెట్. గత ప్రభుత్వం రూ.3లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారిపై పన్నులు విధించగా.. మోదీ ప్రభుత్వం రూ.ఏడు లక్షల వరకు ఎలాంటి పన్నులు ఉండవని స్పష్టం చేయడం హర్షనీయం. అంగన్‌వాడీ, ఆశవర్కర్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు వారికి సైతం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఆరోగ్య భద్రత పొందే అవకాశం కల్పించడం గొప్ప విషయం.

– ఖాండ్రె విశాల్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

సమగ్రాభివృద్ధిపై స్పష్టత లేదు



కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో దళితులకు అంకెల్లో పెరుగుదల.. ఖర్చులో తరుగుదల తీరుగా ఉంది. వారి సమగ్రాభివృద్ధిపై స్పష్టత లేదు. మొత్తం బడ్జెట్‌లో దళితులకు సబ్ ప్లాన్ కింద 1,65,597 కోట్లు మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే పెరుగుదల ఉంది. అయితే గతేడాది కేటాయించిన బడ్జెట్‌లో 40శాతం నిధులు ఖర్చు చేయలేదు.

– దుర్గం దినకర్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆరోగ్య భద్రత.. సంతోషకరం



అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఆరోగ్య భద్రత కల్పించడం సంతోషకరమైన అంశం. కానీ ప్రధాన డిమాండ్లు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, టీఏ, డీఏపై స్పష్టమైన హామీ రాలేదు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు కనీసం వేతనం, గ్రాట్యుటీ చెల్లించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలకు పాత పద్ధతి ద్వారా పదోన్నతులు కల్పించాలి. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి.

– త్రివేణి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కనీస వేతనం అమలు చేయాలి



సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేసేలా నిర్ణయం తీసుకోలేదు. ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే సమయంలో విశ్రాంతి గదులు ఉండాలి. కేంద్ర బడ్జెట్‌లో ఆశ వర్కర్లకు మొండిచేయి చూపించారు. నాలుగు లేబర్ కోడ్‌లతోపాటు విద్యుత్ సవరణ బిల్లు 2022ని రద్దు చేయకపోవడం బాధాకరం. అర్హులైన ఆశలను ఏఎన్‌ఎంలుగా నియమించాలి.

– ఎస్.పద్మ, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మున్సిపాలిటీగా ఆసిఫాబాద్

- కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు
- ప్రత్యేక పంచాయతీగా రాజంపేట
- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్



ఆసిఫాబాద్ పట్టణం

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పట్టణ ప్రజల కల నెరవేరింది. ఎట్టకేలకు జిల్లా కేంద్రం గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారింది. ఆసిఫాబాద్, జన్కాపూర్, గొడవెల్లి గ్రామాలను కలిపి ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డి.దివ్య ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 2 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి నుంచి కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో తెలిపారు. ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీ బోర్డును మున్సిపాలిటీగా మార్చాలని, కార్యాలయంలో మినట్స్ బుక్ అందుబాటులో ఉంచాలని సూచించారు.

20 వార్డులతో బల్దియా

గతేడాది ఫిబ్రవరిలో అసెంబ్లీలో మున్సిపాలిటీ ఏర్పాటు ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఏప్రిల్ 9న మున్సిపల్ బిల్లును రాష్ట్ర గవర్నర్ తమిళసై ఆమోదించడంతో ఆసిఫాబాద్ పురపాలిక సంఘంగా రూపాంతరం చెందింది. 3,831 ఎకరాల విస్తీర్ణం(17.02 చదరపు కిలోమీటర్లు), 16,597 మంది జనాభా కలిగిన ఆసిఫాబాద్ బల్దియాలో మొత్తం 20 వార్డులు ఉండనున్నాయి. వాస్తవానికి ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా మార్చాలని 2018లోనే శాసనసభ తీర్మానించింది. రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్ పంపించారు. అయితే ఆసిఫాబాద్‌తోపాటు భద్రాచలం, సారపాక బల్దియా ప్రతిపాదనల్లోనూ ఏజెన్సీ అంశం అడ్డంకిగా మారింది. 2022 డిసెంబర్‌లో రాజంపేట ఏజెన్సీ ప్రాంతాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానీయా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రాజంపేట కొత్త పంచాయతీగా అవతరించడంతోపాటు ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటుకు అడ్డంకి తొలగింది.

జీపీల్లో ఇక 'ప్రత్యేక' పాలన

- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- 335 పంచాయతీలకు 128 మంది అధికారుల కేటాయింపు

ఆసిఫాబాద్అర్బన్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనకు సర్వం సిద్ధమైంది. పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగిసింది. దీంతో జిల్లాలోని 335 జీపీల్లో పాలన కోసం 128 మంది ప్రత్యేకాధికారులను జిల్లా యంత్రాంగం నియమించింది. ఈ మేరకు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గెజిటెడ్ అధికారుల కొరతతో ఒక్కో ప్రత్యేకాధికారికి సుమారు 2 నుంచి 3, 4, 5 పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆయా మండలాల ఎంపీడీవోలు సర్పంచుల నుంచి రికార్డులు, డిజిటల్ కీలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేకాధికారుల కేటాయింపు ఇలా..

జిల్లాలో 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు ఉన్నాయి. 2864 వార్డులు ఉన్నాయి. మొదట ప్రతీ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే తమ కంటే తక్కువ క్యాడర్ ఉన్న ఉద్యోగులను ప్రత్యేకాధికారులుగా నియమించొద్దని కార్యదర్శుల నుంచి విన్నపాలు వచ్చాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేవలం గెజిటెడ్ అధికారులను మాత్రమే ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించారు. మేజర్ జీపీల బాధ్యతలను తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీఈలకు అప్పగిస్తుండగా, జనాభా ఎక్కువగా ఉంటే ఎంపీవో, డిప్యూటీ తహసీల్దార్లను నియమిస్తున్నారు. అలాగే కొత్త పంచాయతీలు, చిన్న జీపీలకు ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారులు, పశు వైద్యాధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఏఈవోలు ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారుల సమన్వయంతో పంచాయతీల్లో పాలన సాగనుంది.

సీఎం కరుణిస్తాడని..

- నేడు ఇంద్రవెల్లికి ముఖ్యమంత్రి రేవంత్ రాక
- సెంటిమెంట్ జిల్లాపై వరాలు కురిపించేనా?
- గంపెడాశతో ఎదురుచూస్తున్న జిల్లావాసులు
- ముందుగా నాగోబా ఆలయంలో పూజలు
- ఇంద్రవెల్లి స్తూపం వద్ద అమరులకు నివాళి
- అధికారిక పర్యటనకు ఇక్కడి నుంచే శ్రీకారం
- పార్లమెంట్ ఎన్నికలకు సమర శంఖారావం



ముస్తాబవుతున్న సభావేదిక

కైలాస్‌నగర్/ఇంద్రవెల్లి: సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. తాను సెంటిమెంట్‌గా భావిస్తున్న ఇంద్రవెల్లి నుంచే తొలి అధికారిక పర్యటనకు శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లావాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జిల్లాను దత్తత తీసుకుని మరీ అభివృద్ధి చేస్తానని ప్రకటించిన రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో అధికారిక పర్యటనకు వస్తుండటంతో ఎలాంటి వరాలు కురిపిస్తారోనని సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నాగోబా దర్శనంతో మొదలయ్యే సీఎం పర్యటన జిల్లాలో 4.35గంటలపాటు కొనసాగనుంది. సభను జయప్రదం చేసేందుకు యంత్రాంగం రెండ్రోజులుగా ఇంద్రవెల్లిలోనే మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తోంది. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు ఇదే సభ నుంచి సీఎం శంఖారావం పూరించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి ప్రజలను తరలించేలా పార్టీ నాయకులు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. ఇందుకు మండలాల వారీగా నాయకులకు బాధ్యతలు అప్పగించారు.

పర్యటన సాగేదిలా..

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 12.20గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.30గంటలకు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నాగోబా ఆలయానికి బయలుదేరుతారు. 1.45నుంచి 2.15 గంటల వరకు నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయ గోపురంతో పాటు వివిధ అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. 2.15 నుంచి 3.15గంటల వరకు నాగోబా దర్బార్ హాల్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 3.15గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 3.30గంటలకు ఇంద్రవెల్లిలోని అమరుల స్తూపం వద్దకు చేరుకుంటారు. గిరిజన అమరులకు నివాళులర్పించిన అనంతరం ప్రత్యేకంగా అభివృద్ధి చేయనున్న అమరుల స్మృతివనానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తారు. 3.50నుంచి 4.50గంటల వరకు ఇంద్రవెల్లి అమరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం 4.55గంటలకు హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక నిర్వహిస్తున్న తొలి అధికారిక పర్యటన కావడంతో విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. అమరుల స్తూపం వద్ద నిర్వహించే బహిరంగ సభకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హెలిప్యాడ్‌తో పాటు సభావేదిక, ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సభకు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలగకుండా సరిపడా కుర్చీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సభ జరగనుండటంతో ప్రత్యేక లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక మైదానాన్ని సిద్ధం చేశారు. సీఎం జిల్లాకు చేరుకుని తిరిగి వెళ్లేలోపు జరిగే కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేసేలా జిల్లా అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలాం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

రెండు గ్యారంటీలు ప్రారంభం!

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రెండు గ్యారంటీలను ఇంద్రవెల్లి సభ నుంచే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లను సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సీఎం ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

నాగోబా దర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎస్పీ గౌస్ ఆలాం, ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ సీఎస్ సందీప్ సుల్తానియా, గిరిజన సంక్షేమ శాఖ సీఎస్ శరత్ నాగోబా ఆలయంతో పాటు దర్బార్ హాల్, అమరుల స్తూపం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. నాగోబా దర్బార్ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి 400 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం కానున్నారు. వీరికి ఉపాధి కల్పిస్తున్న పలు స్టాళ్లను పరిశీలించనున్నారు.

భారీ బందోబస్తు

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయం, అమరుల స్తూపం వద్ద ఎస్పీ గౌస్ ఆలాం ఆధ్వర్యంలో సుమారు 1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగోబా ఆలయంతో పాటు అమరుల స్తూపం వద్ద సీఎం ప్రత్యేక సెక్యూరిటీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు.

క్లుప్తంగా

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

చింతలమానెపల్లి: బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన గురువా రం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... కౌటాల మండలంలోని శిర్ష గ్రామానికి చెందిన దేవ నరేష్(19) మండలంలోని ఖర్జెల్లి గ్రామ శివారుకు గొర్రెలను మేపడానికి తీసుకెళ్లాడు. నీటి కోసం వ్యవసాయ బావివద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులోపడిపోయాడు. సమీపంలోని తోటి కాపరులు గుర్తించి బావిలో నుంచి బయటకు తీసి రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. శిర్షా గ్రామానికి చెందిన దేవ గట్టయ్య బీరమ్మలకు నరేష్ ఒక్కడే కుమారుడు. ఘటనా స్థలం వద్ద కుటుంబీకుల రోదనలు కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపాడు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు గురువారం గుర్తు తెలియని వృద్ధుడు (70) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వృద్ధుడు బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించే వాడుగా అనుమానిస్తున్నారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లేకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలకు 9989397901 సంప్రదించాలని తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి


మారుపాక బాణయ్య(ఫైల్)

కోటపల్లి: మండలంలోని ఎసన్వాయి గ్రామానికి చెందిన మారుపాక బాణయ్య(52) బైక్ పైనుంచి పడి మృతిచెందాడు. మారుపాక బాణయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం చెన్నూర్ వచ్చి పనులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. సర్వాయిపేట గ్రామానికి సమీపంలో అటవీ ప్రాంతంలోని మైసమ్మ గుడికి దగ్గర బైక్ అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్ ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

శ్రీరాంపూర్:కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్)లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభమయ్యాయని బీఎంఎస్ వేజ్‌బోర్డు సభ్యుడు, సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మారెడ్డి, యూనియన్ కేంద్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఢిల్లీలోని సీఎంపీఎఫ్ కార్యాలయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారని పేర్కొన్నారు. ఇక సింగరేణి ఉద్యోగులు ఆన్‌లైన్‌లో తమ ఖాతాలో ఉన్న డబ్బుల వివరాలు, ఇతర వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. క్లెయిమ్‌లు కూడా త్వరగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఇంద్రవెల్లి నుంచే 'పునర్నిర్మాణం'

- మంత్రి సీతక్క
- ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మంచిర్యాలటౌన్:పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఇంద్రవెల్లిలో మొదటి బహిరంగ సభ నిర్వహించగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అందుకే ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం హోదాలో అభివృద్ధి పనులను సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఇక్కడి నుంచే మొదలు పెట్టబోతున్నారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి సీతక్క అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నాడు ఉద్యమాల్లో పాల్గొన్నానని, చేయాల్సింది ఎంతో ఉందని తెలిపారు. దళిత గిరిజన దండోరాను ఇంద్రవెల్లి నుంచి పీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, నేడు అధికారంలోకి వచ్చి మొట్టమొదటి సభను కూడా ఆయన ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నామన్నారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఎన్నో ప్రాజెక్టులు మంజూరు చేశారన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తెస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని కాళేశ్వరంగా మార్చి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల్లో కనీసం వైద్యులు లేరని, స్టాఫ్‌నర్సులను నియమించే నోటిఫికేషన్ ఇచ్చేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందన్నారు. నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇస్తున్నామంటూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేశారని, అందుకే కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం..

బీఆర్‌ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు.కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మరమ్మతులకు నిధులు విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రజలను, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసే అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు కూడా సకాలంలో ఇవ్వలేదని గుర్తు చేశారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తే, బీఆర్‌ఎస్ నేతలు అక్కసుతో ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు కూడా ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ఇస్తే అక్కసుతో అడ్డుకుంటున్నారని విమర్శించారు.

ఇంద్రవెల్లి సభ విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కోరారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా మొట్టమొదటి సభను 2021, ఆగస్టు 9న ఇంద్రవెల్లిలో సభ నిర్వహించారని గుర్తుచేశారు. మళ్లీ నేడు సీఎం హోదాలో ఇంద్రవెల్లికి వస్తున్నారని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో గత ఎమ్మెల్యే పదేళ్లలో పది ఎల్‌వోసీలు ఇవ్వగా తాను కేవలం నెల రోజుల్లోనే 33 ఎల్‌వోసీలు ఇచ్చానని తెలిపారు. సీఎం సభకు 135 బస్సులు, 150 వాహనాల్లో ప్రజలను తరలిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు, ఓనర్లకు ఈనెల 10వ తేదీ తర్వాత ఉచితంగా బీమా చేయిస్తానని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో చనిపోతే రూ.15 లక్షలు బాధిత కుటుంబానికి అందతాయని తెలిపారు. సమావేశంలో ఐఎన్టీయూసీ అధ్యక్షుడు జనక్‌ప్రసాద్, డాక్టర్ గణేశ్‌రాథోడ్, మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా స్థాయి మెగా క్రికెట్ పోటీలు

జన్నారం: సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు సంత్ సేవాలాల్ యువసేన నాయకులు బి.సాయికిరణ్, గంగాసింగ్, బద్రేశ్వర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.2వేలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలలో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు ఉంటుందని పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బొజ్జుపటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శర్మన్ నాయక్ హాజరవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 93924 49041, 78935 56313లను సంప్రదించాలని కోరారు.

రగ్బీలో రాణించాలి


పరిచయం చేసుకుంటున్న ఎస్సై రాజేష్

శ్రీరాంపూర్: ఏరియా క్రీడాకారులు రగ్బీ క్రీడల్లో రాణించాలని ఎస్సై రాజేష్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి హై స్కూల్లో గురువారం రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 జిల్లాస్థాయి బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తిని పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్, పాఠశాల ప్రిన్సిపాల్ మహేందర్ ఉన్నారు.

శ్రీరాంపూర్‌లో 106 శాతం ఉత్పత్తి



ఉత్పత్తి వివరాలను వెల్లడిస్తున్న జీఎం సంజీవరెడ్డి

- జీఎం బి.సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో జనవరిలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 106శాతం ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. జనవరిలో 6.16 లక్షల టన్నులకు 6.54లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించడం జరిగిందన్నారు. దీంతో పాటు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 55.47లక్షల టన్నులకు 46.66 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. దీంతో 84శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు వివరించారు. భూగర్భగనుల్లో ఇప్పటి వరకు 92శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. కంపెనీ ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళ్తుందన్నారు. ప్రతి రోజు 2.2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందన్నారు. మిగిలిన ఈ రెండు నెలలు కూడా మరింత ఉత్పత్తిని తీస్తే లక్ష్యానికి చేరువలో ఉంటామన్నారు. శ్రీరాంపూర్‌లో ఓసీపీల్లో ఓబీ కాంట్రాక్ట్ కేటాయింపులతో ఓబీ వెలికితీతా జాప్యం జరిగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయమన్నారు. బొగ్గు నిల్వలు అడుగంటినందున మరో రెండేళ్లలో ఎస్సార్పీ 1, ఆర్కే 6 గని మూతపడనుందన్నారు. వీటిని ఓసీపీలుగా మార్చే అవకాశముందన్నారు. ఉద్యోగులకు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై అవగాహన కల్పించేందుకు గనులపై మల్టీ డిపార్టుమెంట్ల సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్‌లో గత సంవత్సరం 899మందికి గ్రాట్యూటీ సెటిల్ చేశామన్నారు. కంపెనీ వ్యాప్తంగా ఇప్పటికి 15256 మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ సమావేశంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, క్వాలిటీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్వర్ రెడ్డి, డీవైపీఎం తుకారాం పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళల, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంద్రత్ ఈశ్వర్, శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దిలావర్పూర్ మండలంలోని న్యూలోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10గంటలకు ఒరిజినల్ ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సురేష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్‌లను సంప్రదించాలని తెలిపారు. పోటీలలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఫిబ్రవరి 8 నుండి 11 తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీలలో పాల్గొంటారని, వివరాలకు 9398430685 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితుల ఆరోపణ
- తమ తప్పేమి లేదంటున్న వైద్యులు


మృతిచెందిన శిశువును పట్టుకుని రోదిస్తున్న మేనత్త

బెల్లంపల్లి: బెల్లంపలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గురువారం ఆడశిశువు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ప్రసవం జరిగిన కొద్ది నిమిషాల వ్యవధిలో శిశువు చనిపోవడంతో బాధిత కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే పసికందు ప్రాణాలు వదిలిందని ఆరోపించారు. మృతశిశువు తండ్రి పాగిడి తిరుపతి కథనం ప్రకారం... కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలం బొంబాయి గూడ గ్రామానికి చెందిన పాగిడి రజిత అలియాస్ తాళ్లపల్లి రజిత నిండు గర్భిణి. నొప్పులు రావడంతో సిర్పూర్ (టీ) సీహెచ్‌సీకి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఇక్కడి వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. అప్పటికే పురిటి నొప్పులు వచ్చినప్పటికీ గంటలపాటు కాలయాపన చేసి 11 గంటల ప్రాంతంలో డెలివరీ చేశారు. పుట్టిన శిశువు ఏడవడం లేదని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారు. కుటుంబీకులు అంబులెన్స్‌లో మంచిర్యాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి శిశువు మృతి అప్పటికే మృతిచెందిందని తెలిపారు. తిరిగి బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయిందని తిరుపతి ఆరోపించాడు. తొలిచూరు బిడ్డను తమకు కాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాన్పు చేయడానికి నిర్లక్ష్యం చేయలేదు

గర్భిణి క్లిష్టతరమైన పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చింది. ఏరియా ఆసుపత్రికి రాగానే ఆమె డెలివరీకి దగ్గరగా ఉన్నట్లు గుర్తించారు. శిశువు తల కాస్తా బయటకు వచ్చినట్లుగా గుర్తించి వెంటనే అడ్మిట్ చేసుకుని కాన్పు చేయడానికి యత్నాలు ప్రారంభించారు. అతికష్టంగా కాన్పు చేశారు. అయితే పుట్టిన శిశువు ఏమాత్రం ఏడవ లేదు. శిశువును పరీక్షించగా పల్స్, హార్ట్ బీట్స్ సరిగానే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చి మెరుగైన వైద్యం కోసం వెంటనే అంబులెన్స్‌లో మంచిర్యాలకు పంపించారు. అక్కడికి తీసుకెళ్లాక శిశువు చనిపోయిందా, మార్గమధ్యలో మృతి చెందిందా అనేది తెలియదు. మా వరకు ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు.

– డాక్టర్ రవి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, బెల్లంపల్లి

అనుమతి లేకుండా బెల్లం విక్రయిస్తే చర్యలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్


మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

చెన్నూర్: జాతర పేరుతో వ్యాపారులు బెల్లం అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మంచిర్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్ అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన గుడుంబా, మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసిన 86 లిక్కర్ కేసులతో పాటు గుడుంబాను పారపోయడం జరిగిందన్నారు. మేడారం జాతర మొక్కుల కోసం బెల్లం తీసుకొని వచ్చే వ్యాపారులు ముందుగా ఎక్సైజ్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే నలబెల్లం విక్రయించే వ్యాపారులను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో గుడుంబా విక్రయాలు జరిగితే ఎక్సైజ్‌శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పీఏసీఎస్ చైర్మన్


రవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సీతక్క

జన్నారం: జన్నారం మండలం పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అల్లం రవి గురువారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఆయన ఇటీవల అవిశ్వాసంపై నెగ్గి చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. ఇంద్రవెల్లి మండల పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరాడు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, ఇసాక్, మచ్చ శంకరయ్య, మేకల మాణిక్యం, కరుణాకర్, వెంకటరాజం ఉన్నారు.

ప్రొటోకాల్‌పై జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ ఆగ్రహం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి సంబంధిత చైర్మన్‌కు సమాచారం ఎందుకు ఇవ్వలేదని జిల్లా పరిషత్ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన వెంటనే ఆ తర్వాత జరిగిన సమావేశానికి హాజరుకాకుండా తన అనుచరులతో పీఏసీఎస్ కార్యాలయంలోకి వెళ్లాడు. డైరెక్టర్లతో సమావేశమైన ఆయన అక్కడి నుంచే చరవాణిలో మౌఖికంగా ప్రొటోకాల్ నిబంధనను అధికారులు ఉల్లంఘించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. త్వరలోనే పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు సమావేశమై ప్రొటోకాల్ నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించి కలెక్టర్‌కు పంపించాలని డైరెక్టర్లను ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, పెద్దింటి వెంకటేశ్వర్‌రావు, నానాజీ, రామన్న, బీఆర్‌ఎస్ నాయకులు మౌల్కార్ లక్ష్మణ్, రాజన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులు వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఉపాధిహామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న సీసీ రోడ్లు, జీపీ భవనాలు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అవసరమైన పనులకు అంచనా నివేదికలు రూపొందించి పరిపాలన అనుమతులు పొందాలని ఆదేశించారు. పూర్తయిన పనుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

మంత్రిని కలిసిన అధికారుల సంఘం ప్రతినిధులు


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న అధికారుల సంఘం నాయకులు

శ్రీరాంపూర్:సింగరేణి అధికారుల సంఘం (సీఎంవోఏఐ)లో నూతనంగా ఎన్నికైన శ్రీరాంపూర్ ఏరియా కమిటీ నాయకులు రాష్ట్ర మంత్రి సీతక్కను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన మంత్రిని సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఏరియా జీఎం సంజీవరెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ కలిసి శాలువాతో సత్కరించారు. నూతన కమిటీని జీఎం మంత్రికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, సంఘం ఉపాధ్యక్షులు ఎల్.మహేశ్, కె.కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీలు ఆర్.భీమన్న, గౌస్ పాషా, ట్రెజరర్ రాములు, జాయింట్ ట్రెజరర్ పి.కోటేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీకి ధ్రువీకరణ పత్రాలు అందజేసిన జీఎం

అంతకు ముందు జీఎం కార్యాలయంలో ఇటీవల ఎన్నికైన కమిటీకి అధికారుల సంఘం ఏరియా కమిటీకి జీఎం సంజీవరెడ్డి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కొత్త కమిటీ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అధికారులు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవింద్‌రావు, డీజీఎంఐడీ చిరంజీవులు, ఏజెంట్లు ఏవీ.రెడ్డి, గోపాల్‌సింగ్, రాముడు ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్ బాబు పాల్గొన్నారు.


ఉత్పత్తి వ్యయాలను తగ్గించాలి



మాట్లాడుతున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు ఉత్పత్తి వ్యయాలు తగ్గిస్తూ సంస్థ ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ అధికారుల సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ సంస్థ భవిష్యత్తు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో యంత్రాలను పూర్తి సామర్థ్యంతో వినియోగించాలని సూచించారు. తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గి సంస్థ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతాయని తెలిపారు. ప్రతీ ఉద్యోగి తమ పనితీరు మెరుగుపర్చుకుంటూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ప్రాజెక్టు అధికారులు సత్యనారాయణ, ఉమాకాంత్, ఏజీఎం తిరుమల రావు, డీవైసీఎంవో శౌరీ, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహరా, డీజీఎం ఫైనాన్స్ రామారావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన కోవ లక్ష్మి


కేసీఆర్ నివాసంలో ఎమ్మెల్యే లక్ష్మి, నాయకులు

ఆసిఫాబాద్: టీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాలికి చికిత్స అనంతరం కోలుకోవడంతో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం బీఆర్‌ఎస్ నేతలతో ఆమె కేసీఆర్‌ను కలిశారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

లక్ష్యంతో చదవాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఏకాంబర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర, బాలికల గిరిజన గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ప్రయోజకులు కావాలన్నారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిద్దిదాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, అనిత పాల్గొన్నారు.

సమ్మెలోగా సమస్యలు పరిష్కరించాలి


సమ్మె నోటీసు జీఎంకు ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని, ఈ సమ్మెలో తమ సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డిని జీఎం కార్యాలయం వద్ద కలిసి సమ్మెకు సంబంధించిన నోటీసును అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. సింగరేణిలో కోలిండియాలో అమలవుతున్న హై పవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని, లేదా జీవో నెంబర్ 22ను అమలు పరచాలన్నారు. సెప్టెంబర్ 26, 2022న జరిగిన కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, దొడ్డిపట్ల రవీందర్, కాతరాజు ప్రభాకర్, గట్టు మహేందర్, మేకల రాములు, యాదగిరి, గూడ రాజేష్ పాల్గొన్నారు.